ప్రజాశక్తి
గురువారం 4 జూలై, 2024 5
శ్రీకాకుళం



నేడు విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నీట్, యుజిసి నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఈనెల నాలుగో తేదీన ఎల్‌కెజి నుంచి పిజి వరకు విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బంద్‌కు విద్యార్థులు, విద్యాసంస్థలు సహకరించి జయప్రదం చేయాలని కోరారు. నీట్ ప్రశ్నాపత్రాల లీక్‌కు కారణమైన పరీక్ష నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేకూరే వరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతుందని స్పష్టం చేశారు.

వర్షపాతం కాస్త నయమే



బూర్జ మండలంలో విత్తనాలు చల్లుతున్న రైతు

- జూన్‌లో సాధారణ వర్షపాతం 134.9 మి.మీ
- తొలి నెలలో 128.9 మి.మీ నమోదు
- గతేడాది 70.2 మి.మీ వర్షపాతం
- జిల్లాలో 19.990 ఎకరాల్లో వరి సాగు

ఖరీఫ్ సీజన్‌లో ఒక నెల ముగిసింది. జూన్‌లో సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే కాస్త తగ్గినా గతేడాదితో పోలిస్తే కొంత మెరుగ్గానే ఉండడం సానుకూల అంశంగా ఉంది. నైరుతి రుతుపవనాల విస్తరణతో అక్కడక్కడా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒడిశాలో వర్షాలు కురవకపోవడంతో వంశధార, నాగావళి నదుల్లోనూ నీటి ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. రిజర్వాయర్లలో నీటి నిల్వలు కొంత మెరుగ్గానే ఉన్నాయి. జూలైలోనూ జిల్లాతో పాటు ఒడిశాలో వానలు పెరిగితే రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో పంటల సాగు జోరందుకోనున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2024 ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,21,655 ఎకరాల్లో వేస్తారని అంచనా వేశారు. ఖరీఫ్‌లో మొదటి నెల ముగిసే నాటికి 24,148 ఎకరాల్లో రైతులు పంట వేశారు. వరి పంటను 3,87,322.5 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు 19,990 ఎకరాల్లో సాగవుతోంది. మొక్కజొన్న పంటను 25,270 ఎకరాల్లో వేస్తారని లక్ష్యంగా నిర్ణయించగా 3,950 ఎకరాల్లో వేశారు. మినప పంట 172.5 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు ఐదు ఎకరాల్లో వేశారు. వేరుశనగ పంటను 730 ఎకరాల్లో విత్తనాలు వేయాల్సి ఉండగా 82.5 ఎకరాల్లో వేశారు. పత్తి 3,887.5 ఎకరాలకు గానూ పది ఎకరాల్లో, గోగు పంట 142.5 ఎకరాలకు గానూ ఐదెకరాల్లో, చెరకు 3,485 ఎకరాలకు గానూ 105 ఎకరాల్లో వేశారు. రాగులు, కందులు, పెసలు ఒక్క ఎకరాలోనూ విత్తనాలు పడలేదు.

జూన్‌లో 128.9 మి.మీ వర్షపాతం

జూన్‌లో సాధారణంగా 134.9 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 128.9 మి.మీ వర్షం కురిసింది. వర్షపాతం లోటు 4.4 శాతంగా నమోదైంది. గతేడాది 70.2 మి.మీ వర్షం పడింది. వర్షపాతం లోటు 48 శాతంగా నమోదైంది. ఖరీఫ్‌లో మొదటి నెల ముగిసే నాటికి 11 మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. పాతపట్నం, మెళియాపుట్టి, మందస, ఎల్‌ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసింది.

రిజర్వాయర్లలో నీటి నిల్వలు కాస్త మెరుగు

వర్షాలు కాస్త కురుస్తుండడంతో రిజర్వాయర్లలో నీటిమట్టం నిల్వలు పర్వాదలేనిపిస్తున్నాయి. హిరమండలం వద్ద గొట్టాబ్యారేజీ వాస్తవ సామర్థ్యం 0.66 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 0.64 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. మడ్డువలస రిజర్వాయర్‌లో మాత్రం నీటి నిల్వలు బాగా తగ్గిపోయాయి. రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.6 టిఎంసి నీరు మాత్రమే ఉంది. తోటపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 2.50 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.16 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్ నాయుడు

సురక్షిత విమానయానమే లక్ష్యం

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సురక్షితమైన విమానయాన సేవలు అందించడమే లక్ష్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఢిల్లీలో పౌర విమానయాన శాఖ ఉన్నతస్థాయి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల భద్రత, ఆధునిక సాంకేతిక వినియోగం, హైజాకింగ్ వ్యతిరేక చర్యల బలోపేతం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బిసిఎఎస్ డైరెక్టర్ జనరల్ జుల్ఫీర్ హసన్, ఎంఒసిపిఎ కార్యదర్శి ఉల్మున్‌మంగ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర కేబినెట్ కమిటీలో రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం : కేంద్ర కేబినెట్ కమిటీలో సభ్యునిగా శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడికి చోటు లభించింది. పార్లమెంటరీ, రాజకీయ వ్యవహారాల కమిటీల్లో సభ్యునిగా రామ్మోహన్ నాయుడు నియామకం అయ్యారు.

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఓబులేసు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఓబులేసు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా చల్లా ఓబులేసును ప్రభుత్వం నియమించింది. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) వైస్ చైర్మన్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన గతంలో శ్రీకాకుళం నగరపాలకసంస్థ కమిషనర్‌గా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఆయన్ను సుడాకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో ఐఎఎస్ అధికారి తమీమ్ అన్సారియాను కమిషనర్‌గా అప్పటి ప్రభుత్వం నియమించింది. తమీమ్ అన్సారియాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థకు కీలకమైన కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయనకు ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన తాజా పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు.



మొక్కలు నాటుతున్న వెంకట వరప్రసాద్

మొక్కలతోనే మానవాళి మనుగడ

శ్రీకాకుళం అర్బన్ : మానవాళి మనుగడకు మొక్కలతోనే ముడిపడి ఉందని ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు రత్నాల వెంకట వరప్రసాద్ అన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేం దుకు అవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు ఇందిరా ప్రసాద్, గజల్ వాసుదేవాచారి జన్మదిన వేడుకల్లో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు వాయు కాలుష్యాన్ని నివారిస్తాయని, వన్యప్రాణులకు ఆవాసాలు కల్పిస్తాయన్నారు. నేలకోతను నివారించడంలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. జిల్లాలో హరిత వనాల పెంపకానికి అనుబంధ శాఖల సహకారాన్ని తీసుకుని చర్యలు చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు, వాకర్స్ ఇంటరేష్నల్ ప్రతినిధులు పి.జి గుప్తా, రాడ కైలాసరావు, బి.వి రవిశంకర్, బి.దేవీప్రసాద్ పాల్గొన్నారు.

బైదలాపురం పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని బైదలాపురం పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే పిహెచ్‌సిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఒపి, ఐపి, మందులు, ఇంజక్షన్లు, రికార్డులను పరిశీలించారు. ఇవి సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డిఎంహెచ్ఒతో ఫోన్‌లో మాట్లాడి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనులు అధికంగా ఉండే ఏరియా అని, ఖరీఫ్ సీజన్‌లో పాము, కుక్క కాట్లు అధికంగా ఉంటాయని అన్నారు. వీటికి సంబంధించిన ఇంజక్షన్లు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే వర్షాలు కురుస్తున్నాయని, దీంతో వ్యాధులు ప్రబలుతాయని, అందుబాటులో ఉండాలని అన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి కోరారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, సర్వీస్ రెగ్యులరైజేషన్, పాస్‌పోర్టు ఎన్ఒసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. జిల్లాలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అన్ని టైటిల్స్ సకాలంలో అందజేయాలని, ప్రభుత్వం మంజూరు చేసే కిట్లను పాఠశాల పాయింట్ వద్దకు సరఫరా చేయాలన్నారు. యుడైస్‌లో సాంకేతిక లోపాలను సవరించాలన్నారు. విద్యార్థులు పాఠశాలల్లో చేరే సందర్భాల్లో పూర్వపు పాఠశాలలో వారి పేరును ఆన్‌లైన్‌లో వెంటనే తొలగించి, కొత్తగా చేరిన పాఠశాలలో ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు సంబంధిత తహశీల్దార్లను విద్యాశాఖ నుంచి కోరాలన్నారు. ఉపాధ్యాయులు కొరత ఉన్న చోట విద్యా వాలంటీర్లను నియమించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆన్‌లైన్ వర్క్ చేయడానికి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని కోరారు. వీటిపై డిఇఒ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, నాయకులు ఎల్.కోదండరామయ్య, ఆర్.త్రినాథరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.



డిఇఒకు సమస్యలను వివరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

శ్రీకాకుళం అర్బన్ : ఎపిఎస్ ఆర్‌టిసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్ తరగతులను డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు పూర్తయ్యాయని, 16వ బ్యాచ్ తరగతులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌లో చేరిన వారికి దేశంలో ఎక్కడా లేని విధంగా హెవీ డ్రైవింగ్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ నేర్చుకున్న తర్వాత ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లుగా నియమితులయ్యే అవకాశముందన్నారు. ఆర్‌టిసిలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేసే వీలుందన్నారు. రానున్న రోజుల్లో డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉంటుందని, అప్పుడు మరిన్ని అవకాశాలు వస్తాయన్నారు. ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌లో చేరిన వారికి డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగా, ప్రథమ చికిత్స, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. తదుపరి బ్యాచ్, ఫీజు ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరుగుతున్న దాడులు

ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వైసిపి నాయకులపై దాడులు పెగుతున్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ అంధించిన ఘనత మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డే దక్కుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు తెర తీస్తున్నారని అన్నారు. దీంతో గ్రామాల్లో గ్రూపులతో శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందించే సమయంలో వైసిపి ఎమ్మెల్సీల, ఎంపిపిల, జెడ్‌పిటిసిల జోక్యం లేకుండా అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని కూటమి ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని హితవుపలికారు. సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైసిపి నేతలు నర్తు నరేంద్ర యాదవ్, సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి, నర్తు వరప్రసాద్ పాల్గొన్నారు.

కౌలు గుర్తింపుకార్డులతో ప్రయోజనాలు

వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్



రైతులకు ఎరువులను అందజేస్తున్న వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి - బూర్జ

కౌలు గుర్తింపు కార్డులతో కౌలు రైతులకు గుర్తింపుతో పాటు హక్కులు, ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ తెలిపారు. మండలంలోని పాలవలసలో రైతు సేవా కేంద్రం వద్ద కౌలు గుర్తింపు కార్డుల జారీపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కౌలుదారుల హక్కుల చట్టంపై కౌలు రైతులు, భూయజమానులు అవగాహన కల్పించారు. వీటితోపాటు పిఎం ప్రణామం పథకం కింద భూ సంరక్షణ మట్టి పరీక్షల ఆవశ్యకత, సూక్ష్మ పోషకాల లభ్యతపైనా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుల వల్ల కౌలు రైతులకు రైతు భరోసాకి అర్హులవుతారని తెలిపారు. పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి, పంట నష్టం వాటిల్లినప్పుడు నష్టపరిహారం పొందడానికి, పంటల బీమాకు అర్హులవుతారని వివరించారు. అనంతరం రైతులకు యూరియా, డిఎపిని పంపిణీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ అంబేద్కర్ మండల వ్యవసాయ అధికారి వి.రాజేశ్వరరావు, విఆర్ఒ రమణమ్మ, విఎఎ హేమలత, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ జల్లు అప్పలస్వామి, టిడిపి నాయకులు జల్లు పోలినాయుడు పాలవలస నారాయణమూర్తి, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ల యూనియన్ నాయకులు కె.వి.హేమలత, కె.లక్ష్మి, సిపిఎం నాయకులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలు ఐక్య పోరాటం ఫలితంగా గత ప్రభుత్వం సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలను మినిట్స్ కాపీ ఆధారంగా జిఒలు ఇవ్వాలన్నారు. కనీస వేతనం ప్రకటించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.

మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలు అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎం.సుదీష్ణ, రోహిణి, జయలక్ష్మి, సాయికుమారి, రమ, రమణమ్మ, నిర్మల, అరుణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

నేడు అల్లూరి జయంతి వేడుకలు

శ్రీకాకుళం అర్బన్ : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం కలెక్టరేట్ ఆడిటోరి యంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఈ వేడుకలకు హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా డివిజనల్, మండల, గ్రామస్థాయి కార్యాలయాల్లోనూ అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించాలని సర్క్యులర్ జారీ చేశారు.



స్టేడియం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఇండోర్ స్టేడియం పరిశీలన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కొండములగాం సమీపంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పరిశీలించారు. స్టేడియం నుంచి కొండములగాం ఆర్అండ్బి రోడ్డు నుంచి స్టేడియంకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో క్రీడాకారులు, స్థానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రోడ్డుపక్కన మురుగునీరుతో పాటు కొండ నుంచి వచ్చే వర్షంనీరు వలన ఈ రహదారిలో పూర్తిగా స్టేడియంకు వెళ్లేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యలను స్థానికులు, క్రీడాకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన స్వయంగా బుధవారం పరిశీలించారు. రోడ్డుకు అవసరమైన మరమ్మతులను సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. అదే విధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా పరిశీలించారు. ఆయన వెంట కూటమి నాయకులు లెంక శ్యాం, ముప్పిడి సురేష్ కుమార్, పిన్నింటి భానోజీ నాయుడు, దన్నాన సత్తిబాబు, కాయిత రమణ, రౌతు శ్రీను, వెలిచేటి సురేష్కుమార్, గురాల రఘునాథ్, జి.త్రినాథరావు, శివాంప్రసాద్, నారాయణశెట్టి శ్రీనివాసరావు, రామారావు, దన్నాన స్వామినాయుడు, ఎస్.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



ఫారిన్ డేవిడ్ను సత్కరిస్తున్న ఐతమ్ ప్రతినిధులు

విదేశాల్లో ఉన్నత విద్యకు అవకాశాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అద్భుత అవకాశాలు ఉన్నాయని యునైటెడ్ కింగ్డమ్కు చెందిన లియో గ్లోబల్ ఓవర్సీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ఫాలెన్ డేవిడ్ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో విదేశీ విద్యపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యుకె, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో విద్యాభ్యాసం చేయడం వల్ల అధిక మొత్తం ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. విద్యార్థి దశవుకు అవసరమైన బ్యాంక్, ఫైనాన్స్ పాటు ఉద్యోగ కల్పనకు లియో గ్లోబల్ ఓవర్సీస్ ఏజెన్సీ పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. ఈ సంస్థ అడ్మిషన్ డైరెక్టర్ వాసవి విద్యార్థులకు కావాల్సిన ధ్రువపత్రాల గురించి వివరించారు. ఈ గ్రూపులో అడ్మిషన్ తీసుకున్న వారికి ఉచితంగా ఆంగ్లభాషను నేర్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్యకు ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ప్రోత్సాహంతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. సదస్సులో అసోసియేట్ డీన్ స్టార్ డి. యుగంధర్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు వితరణ

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను కనూరు ఆనందరావు మాస్టారు వితరణగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగు పరుచుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, ఉపాధ్యాయులు నరసింహమూర్తి, హరిప్రసాద్, సిమ్మన్న, భవాని, రజిని, పావని, ఎల్.వి.రమణ పాల్గొన్నారు.

అక్రమమా? సక్రమమా?

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని ప్రధాన రహదారికి ఆణించి ఉన్న లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని గుట్టుచప్పుడుగా రెవెన్యూ అధికారులే అప్పనంగా అప్పగించే వైనం చోటు చేసుకుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పోలాకి కేంద్రంలోని ఇందిరానగర కాలనీ సర్వే నంబరు 122లో నీలి ట్యాంకు దగ్గర ఉన్న స్థలాన్ని తహశీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్కి కేటాయించారని, కాదు ఆక్రమించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. సంబంధిత వ్యక్తి ఆ స్థలంలో మట్టి వేసి చదును చేస్తున్న సమయంలో ఈ వ్యవహారం తేటతెల్లమైందని పలువురు నివ్వెరపోతున్నారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు కనుసన్నల్లో జరుగుతున్నట్లు సమాచారం. ఏ ప్రాతిపదికన కేటాయించారు? ఉద్యోగికి ఎలా కేటాయించారు? ఇలా కేటాయించేందుకు ముడుపులు ఎంత చేరాయి? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇన్నాళ్లూ లేనిది ఇప్పుడే ఆబరా, గాబరాగా స్థలం కేటాయించడంలో అంతరార్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా ఖరీదైన స్థలాలకు కాలు రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాగే మండలంలోని నరసాపురం వద్ద ఇటీవల మంజూరు చేసిన జగనన్న లే అవుట్లలోనూ చాలావరకు అవకతవకలు జరిగాయని స్థానికులు కూన శ్యామలరావు, నారాయణరావు ఆరోపిస్తున్నారు. గతంలో తహశీల్దార్కు ఫిర్యాదు చేసినా స్పందలేదని వాపోయారు. జిల్లా అధికారులు కలుగుజేసుకుని ఈ స్థలాన్ని పరిశీలించి తగు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ ప్రసాదరావును వివరణ కోరగా, తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.



స్థలంలో వేసిన మట్టి

అప్పలరాజు పరామర్శ

పలాస : మండలంలోని మాకన్నపల్లికి చెందిన యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు బత్తిన ఓంకార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, మాజీ సర్పంచ్ తెప్పల అప్పలస్వామి, రాపాక చిన్నారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశవరావు ఉన్నారు.

లావేరు: మండలంలోని చిన్నమూరపాకకు చెందిన వైసిపి కార్యకర్త మీసాల జగ్గునాయుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్కుమార్ బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుమారులు సూరి నాయుడు, వెంకటప్పలనాయుడు, శ్రీనులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట లావేరు జెడ్పిటిసి మీసాల సీతంనాయుడు, మీసాల భాను, గొర్లె సూర్యప్రకాష్, రమణ తదితరులున్నారు.

మొక్కలు నాటాలి

కోటబొమ్మాళి: మానవళి మనుగడ సాగించాలంటే చెట్లు చాలా అవసరమని బిజెపి మండల అధ్యక్షులు మెట్ట తిరుమలరావు అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం చెరువు గొట్టుపై బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా చిన్నతనంలో రోడ్లు పక్క, పెరటిలో, కళ్లాల్లో ఎక్కడ బడితే అక్కడ మొక్కలు కనిపించేవని, క్రమేపీ అవి కనుమరుగైయాయని అన్నారు.

బైక్ మెకానిక్ల ర్యాలీ

ఇచ్ఛాపురం : అంతర్జాతీయ టూ వీలర్ దినోత్సవం సందర్భంగా బైక్ మెకానిక్ల యూనియన్ ఆధ్వర్యాన మూడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో మెకానిక్లు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించిన బైక్ ర్యాలీ కవిటి, కంచిలి, సోంపేట మండలాలు మీదుగా సాగింది. అనంతరం పట్టణంలో రాజీవ్ టూరిజం పార్కు వద్ద నియోజకవర్గస్థాయి యూనియన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

కూటమితో ప్రజా పాలన

సరుబుజ్జిలి: కూటమి ప్రభుత్వంతో ప్రజా పరిపాలన మొదలైందని జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. బుధవారం మండలం కొత్తకోట, నక్కలపేట, గోనెపాడులో పలువురు బాధితులను పరామర్శించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.7 వేలు పింఛన్ను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేశామన్నారు. టిడిపి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు అంబల్ల రాంబాబు, పైడి మురళీ మోహన్, గోనెపాడు సర్పంచ్ బిర్లంగి నాగేశ్వరరావు, జనసేన ప్రధాన కార్యదర్శి పేడాడ రమణ పాల్గొన్నారు.

పాలన మారింది .. పవర్ కట్ వచ్చింది

విద్యుత్శాఖ అధికారులపై సభ్యుల ధ్వజం

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో పాలన మారిన వెంటనే విద్యుత్ కోతలు ప్రారంభమయ్యాయని వైసిపి కౌన్సిలర్లు విద్యుత్శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోర పుష్ప అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. విద్యుత్శాఖ పనితీరుపై జరిగిన చర్చలో సభ్యులు మాసపత్రి చక్రవర్తిరెడ్డి, దక్కత ఏకంబరిదేవి, నర్తు వరప్రసాద్ విద్యుత్ కోతలపై మండిపడ్డారు. పాలన మారిన వెంటనే విద్యుత్ కోతలు ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపిపి కారింగ మోహనరావు అన్నారు. దీనిపై ఎఇ గోవిందరావు సమాధానం ఇస్తూ... విద్యుత్ సబ్ స్టేషన్లో సాంకేతిక సమస్యలు వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వివరణ ఇచ్చారు. డ్వాక్రా మహిళా సంఘాల్లో పనిచేస్తున్న సిఎఫ్లు డబ్బులు తీసుకొని తీర్మానాలు రాస్తున్నారని చక్రవర్తిరెడ్డి, ఏకాంబరి ఆరోపించారు. మండలంలో ఆరు రకాల వరి విత్తనాలు 741 క్వింటాళ్లు సరఫరా చేశామని వ్యవసాయాధికారి తెలిపారు. కోతులు, అడవి పందులు బెడద ఎక్కువగా ఉన్నాయని, వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు నర్తు వరప్రసాద్, ఏకాంబరి కోరారు. హౌసింగ్లో అవినీతి ఎక్కువయ్యిందని, ప్రజాప్రతినిధి అని చూడకుండా తన దగ్గరే రూ.3 వేలు లంచం తీసుకున్నారని సభ్యుడు చక్రవర్తిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని బాహుదా నదిపై ఉన్న ఛానల్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని సభ్యులు గుజ్జు ఢిల్లేశ్వరరావు కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్శాఖ ఎఇ గోవిందరావు

కౌలు రైతులకు అవగాహన



నందిగాం : మాట్లాడుతున్న ఎఒ శ్రీకాంత్వర్మ

సోంపేట: సాగుదారు హక్కు పత్రాలకు, భూమి కౌలుకు చేస్తున్న రైతులు అవసరమైన పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని మండల ఎఒ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని కర్తలపాలెం, పొత్రకొండ గ్రామాల్లో రైతు సేవ కేంద్రాల్లో భూ యజమానులకు, కౌలు రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నమోదు, ధాన్యం కొనుగోలు, పంటల బీమా, కౌలుదారు రుణాలు, ప్రభుత్వం ద్వారా వచ్చే వివిధ సదుపాయాలు భూ యజమానులతో పాటు వర్తిస్తాయని తెలిపారు. అనంతరం గతంలో సేకరించిన మట్టి నమూనాల, భూసార పరీక్ష ఫలితాలు పత్రాలను అందజేశారు. ఈ ఫలితాలను ఉపయోగించి సిఫార్సుల మేరకు ఉపయోగిస్తే ఎరువుల వినియోగం తగ్గి భూసార పరిరక్షణ, సాగు ఖర్చు ఆదా అవు తుందని తెలిపారు. కొత్త వంగడాల చిరు సంచులు సరఫరా చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు తామాడ పాపారావు, బురద విశ్వనాథం, సర్పంచ్ పొందూరు గున్నయ్య, సీర సవరయ్య, సీర ఢిల్లీరావు రైతులు పాల్గొన్నారు.

నందిగాం : కౌలు రైతులు దరఖాస్తు చేసుకుంటే సాగు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తహశీల్దార్ వి.పద్మావతి తెలిపారు. మండలంలోని హర్షబాడ, నౌగాం గ్రామాల్లో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఎఒ శ్రీకాంత్వర్మ, ఎఇఒ గణపతి పాల్గొన్నారు.

ఎస్ఐ ఢిల్లీరావుకు సత్కారం

శ్రీకాకుళం అర్బన్: పోలీసు శాఖలో కానిస్టేబుల్గా విధుల్లో చేరి అంచెలంచెలుగా ఎస్ఐ స్థాయి వరకు ఎదిగిన ఢిల్లీరావు వివాద రహితునిగా పేరు తెచ్చుకుని ఉద్యోగ విరమణ పొందడం ఎంతో ఆనందంగా ఉందని నగరానికి చెందిన పలువురు పేర్కొన్నారు. బుధవారం శ్రీ ఫంక్షన్ హాల్లో ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఆయన మిత్రులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఢిల్లీరావు, పార్వతి దంపతులను శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత పి.ఢిల్లీరావు మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పోలీసు శాఖలో పని చేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు. నేర పరిశోధనలో సుదీర్ఘ కాలం పని చేసిన కాలంలో ఎంతో మంది నేరస్తులను పట్టుకోవడంలో సహకరించానన్నారు. ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్న సమయంలో ఎంతో సంతృప్తి చెందానన్నారు. తనకు పూర్తి సహకారాన్ని అందిం చిన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుశాఖలో పని చేస్తున్న ఎస్ఐ రమణ, దుర్గారావు, వెంకటేశ్వర స్వీట్స్ అధినేత వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వంశీ మృతదేహం

ట్రాక్టర్ బోల్తా : యువకుడు మృతి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని కొండభీంపురం సమీపంలో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. నందిగాం మండలం తామరాపల్లికి చెందిన పోలాకి వంశీ (29) ట్రాక్టర్పై మట్టిలోడు తీసుకెళ్తున్నాడు. ఈ సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ ముందు భాగం కింద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తిరుమతి, బుచ్చమ్మ ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సోంపేట: మండలం బాతుపురం-కొత్త బాతుపురం గ్రామాల మధ్య ఆలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బారువ పోలీసులు బుధవారం కనుగొన్నారు. ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆనవాళ్లు బట్టి తెలుస్తోందని, మృతునికి 50 ఏళ్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే బారువ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక విఆర్ఒ సమాచారం మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలోని చీడిపాలెంలో టెక్కలి సెబీ ఎన్ఫోర్స్మెంట్, పలాస డిటిఎఫ్ సిబ్బంది సంయు క్తంగా బుధవారం నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేశారు. అనంతరం గ్రామ స్తులకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టా లను తెలియ జేశారు. సెబీ సిఐ జి.రాజశేఖర్ నాయుడు, డిటిఎఫ్ సిఐ పి.రామచంద్రకుమార్, ఇంటలిజెన్స్ సిఐ కూర్మారావు, ఎస్ఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడు ట్రాక్టర్లు సీజ్

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ కుంకమ సాగర్లో ప్రైవేట్ వ్యక్తులు విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు దాడులు చేసి మూడు ట్రాక్టర్లును సీజ్ చేసి ఒక్కొక్క ట్రాక్టర్ నుంచి రూ. 1350 చొప్పున అపరాధ రుసుం వసూలు చేసినట్లు తహశీల్దార్ ఎస్ ఎస్ వి ఎస్ నాయుడు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా మట్టి, కంకర తవ్వకాలు చేపడితే కఠినంగా చర్యలు ఉంటాయన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ నిరంజన్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి అండగా...

బూర్జ: చిన్ననాటి స్నేహితుడు అకాల మృత్యువాత పడటంతో తోటి మిత్రులు స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. బూర్జ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2000లో 10వ తరగతి వరకు చదువుకున్న తోటి మిత్రుడు పాలకొండ మండలం అంపిలి గ్రామానికి రేగాన రాజేష్ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందాడు. ఆయనతో బూర్జ పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రాజేష్ భార్య, పిల్లలను బుధవారం పరామర్శించారు. వారికి చేయుతగా రూ.20 వేలు స్నేహితుల సహకారంతో అందించారు. రాంబాబు, సత్యన్నారాయణ, హరినాథ్, నీలయ్య పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ రాజేష్, ఫీల్డ్ ఆఫీసర్ రవి సేవలు మరువలేనివని బ్యాంకు మిత్రులు, విఒఎలు తెలిపారు. బదిలీ వెళ్లిన రాజేష్, రవిలకు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మహిళా సంఘాలకు రుణాలు అందించి వారి స్వావలంబానికి ఎనలేని కృషి చేశారని అన్నారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం

ఇచ్ఛాపురం: ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దామని స్థానిక జ్ఞానభారతి విద్యా సంస్థల కార్యదర్శి, ముఖ్య కార్య నిర్వహణాధికారి జోహార్ఖాన్ పిలుపునిచ్చారు. పాఠశాలల విద్యార్థులతో బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. 'సింగిల్ యూస్ ప్లాస్టిక్ను పూర్తిగా బహిష్కరిస్తామని, ప్లాస్టిక్ వ్యర్థాలపై సమాజంలో అందరికీ అవగాహన కల్పిస్తామని, వర్తమాన, భవిష్యత్ కాలాల్లో ప్లాస్టిక్ లేకుండా చేసేందుకు అందరినీ కార్యోన్ముఖులను చేస్తానని' విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగాన్ని తమ జీవితాల నుంచి దూరంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందు భూషణ్పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్కుమార్, ట్రాన్స్పోర్టు మేనేజర్ అలీమ్ఖాన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్: రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడే శక్తి ఉందని, ఆ దిశగా యువత రక్తదానం చేయాలని లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. బుధవారం నగరంలోని ఎస్బిఐ స్టాఫ్ కాలనీ, సత్యసాయి భజనా మందిర ప్రాంగణంలో లైన్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన ఈశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్లడ్బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ ఆధ్వర్యాన నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ సారవకోట సచివాల పరిధిలో వెటర్నరీ సహాయకులు రవికుమార్ సాహు తన తల్లి, జిల్లా మాజీ మహిళా మండలి అధ్యక్షురాలు జ్యోతి సాహు ఐదవ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రవిసాహు స్నేహితులు 16 మంది రక్తదానం చేశారు. క్లబ్మెంటార్ నటుకుల మోహన్, సెక్రటరీ డాక్టర్ సింధూర, ట్రెజరర్ జోగి భారతి, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఓంకార్ సంతాప సభ

పలాస : మండలంలోని నీలావతిలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఉద్దాన విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యాన ఓంకార్ సంతాప సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు శివ ఒక ప్రకటనలో తెలిపారు. సంతాప సభకు విద్యావంతులు, అబిమానులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస: పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్ల మరమ్మత్తుల నిమిత్తం 5న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వరదా వారి క్వార్టర్స్ పరిధిలో, అలాగే మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బిఆర్ నగర్ గేట్ స్కూల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వికలాంగ విద్యార్థులకు వసతి సౌకర్యం

శ్రీకాకుళం అర్బన్: వికలాంగుల సంక్షేమ శాఖ, ఆధ్వర్యాన చలన సంబంధ, బధిర, అంధ వికలంగులైన బాలికల కోసం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నట్టు సంక్షేమ శాఖాధికారి కె.కవిత ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వసతి గృహంలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు ధరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. వసతి గృహంలో 1 నుంచి 10వ తరగతి, ఇంటర్, ఆపై తరగతుల వరకు చదువుతున్న విద్యార్థినులకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. వసతిగృహంలో ఉచిత భోజనం, వసతితో పాటు, నోట్బుక్స్, యూనిఫారమ్, కాస్మోటిక్ చార్జీలు అందజేయనున్నట్టు తెలిపారు. విద్యార్థినులు వారి ఆధార్ కార్డు, వికలాంగ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రం, ఏదైనా పాఠశాలలో చదివితే బదిలీ ధ్రువీకరణ పత్రంతో నేరుగాగాని, పోస్టు ద్వారాగాని, మెయిల్ ద్వారాగాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మేట్రిన్ ఫోన్ నెంబరు 8074777210, 9951971764లకు సంప్రదించాలన్నారు.

6న మెగా జాబ్మేళా

రణస్థలం రూరల్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఈనెల 6న రణస్థలంలో మెగా జాబ్మేళా నిర్వహిస్తున్నట్టు నిర్వాహక ప్రతినిధులు విజయ్, ఎన్.సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, ఎంఎస్ఎన్ రీసెర్చి ఫర్ బెటర్ మెడిసిన్ కంపెనీ నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్ ఎంపిసి, బైసిపి, ఎంఎల్టి, బిఎస్సి కెమిస్ట్రీ అర్హత గలవారు హాజరు కావచ్చని తెలిపారు. ఎంఎస్ఎన్ కంపెనీలో టెక్నికల్ ట్రైనీ ఉద్యోగానికి పురుష అభ్యర్థులు 20 ఏళ్ల వయసు గలవారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. అపిటోరియా కంపెనీలో అప్రంటిస్ ట్రైనీ ఉద్యోగానికి బిఎస్సి కెమిస్ట్రీ చదివిన వారు హాజరు కావాలన్నారు. మండలంలోని బంటుపల్లిలో ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్లో ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 8096888868, 7799833983 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పవన్ను కలిసిన భవాని

మెళియాపుట్టి : జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ను నియోజకవర్గ జనసేన నాయకులు కొరికణ భవాని మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో ఉన్న ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం పాతపట్నం నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈమెతో పాటు రవికుమార్ ఉన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 1,2 వార్డుల కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్కుమార్, చాట్ల పుష్ప ఆధ్వర్యాన రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు దినేష్ 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ బి.చిన్నారావు, పిఆర్ఒ సంతోష్కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొంతాల రామ్మూర్తి, దానయ్య, కె.ఢిల్లి, ఆర్.ఢిల్లి పాల్గొన్నారు.

ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లా సాయి కాలనీలో లోవోల్టేజ్ సమస్యతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి విద్యుత్ అధికారులను ఆదేశించారు. అధికారులు స్పందించి సిమెంట్ దిమ్మ నిర్మించి ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆళ్ల వెంకటరావు, వడ్డీ యాదగిరి, ఆళ్ల కృష్ణారావు, బెండి రమేష్, తుంగాన సింహాచలం, కొవ్వూరు ఢిల్లీ పాల్గొన్నారు.

సాగుహక్కు గుర్తింపు కార్డులు పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న త్రినాథస్వామి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగుహక్కు గుర్తింపు కార్డులను పొందాలని ఎఫ్టిసి డిడి ఎ.త్రినాథస్వామి అన్నారు. బుధవారం మండలంలోని దూసిలో కౌలు రైతుల గుర్తింపు, నమోదు కొరకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగుహక్కు పత్రానికి దరఖాస్తు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా పంట రుణాలు, ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోళ్లు, రాయితీపై వ్యవసాయ ఉత్పత్తులైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి పథకాలు వర్తించడం జరుగుతుందన్నారు. అలాగే భూసార పరీక్షలు, వాటి ఫలితాలను క్షుణ్ణంగా రైతులకు వివరించారు. ఎరువులు ఎంత మోతాదులో ఏ సమయంలో ఎలా వాడాలో రైతులకు తెలియజేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఎడి బగ్గు రజిని మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్లో వరి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో ఎదలో చేపట్టాల్సిన కలుపు యాజమాన్యం పద్ధతులను వివరించారు. భూసార పరీక్ష ఫలితాలు, సూక్ష్మ పోషకాలు, బయో ఫెర్టిలైజర్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు రాయితీపై సూడోమోనస్ ఎరువులు పంపిణీ చేశారు. టిడిపి నాయకుడు తమ్మినేని అప్పలనాయుడు, రాజశేఖర్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ తమ్మినేని అలేఖ్య, ఎఇఒ రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సింధు

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆర్డిఒ సింధు ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని పొన్నంపేటలో సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్నా), రామారావు సమక్షంలో ఎస్ఎస్టి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎవరు ఫోన్లు చేసి వివరాలు అడగరన్నారు. ఎటిఎం కార్డు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ వివరిస్తూ నగదు రహిత లావాదేవీలను కొన సాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంజెజెవై, పిఎంఎస్బివై బీమా పథకాలను క్షుణ్ణంగా వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ఫ్రీ నెంబర్కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మేన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సిసి రామప్పడు, సిఎఫ్ గాయత్రి, మాజీ ఎంపిటిసి ఇప్పిలి సత్యం, మాజీ సర్పంచ్లు కోటేశ్వరరావు, సూర్యారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపిహెచ్ఒ అభిమన్యు సోయి

జ్వరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- కవిటి

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని రాజపురం పిహెచ్సి ఎంపిహెచ్ఒ అభిమన్యు సోయి అన్నారు. కవిటి కాలనీలో ఎక్కువగా జ్వరాలు వస్తున్నాయనే సమాచారంతో బుధవారం కాలనీలో వైద్య సిబ్బందితో పాటు ఇంటింటికీ వెళ్లి పరీక్షించారు. పంచాయతీ ఆధ్వర్యాన పారిశుధ్యం పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లారు. అనుమానిత వ్యక్తి నుంచి శ్యాంపుల్ తీసి టెక్కలి ప్రభుతాస్పత్రికి పంపించారు. ఇఒ వీరభద్ర స్వామి, కేశవరావు, సుదర్శన్, ఆశాలు పాల్గొన్నారు.

ఫ్యాన్లు వితరణ

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్-ఎస్ఆర్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు అన్నారు. క్రమశిక్షణతో చదివితే లక్ష్యాలు చేరుకోవడం చాలా సులువన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీలోనే మీ భవిష్యత్ని నిర్ణయించుకోవడం జరుగుతుందన్నారు. బుధవారం నగరంలో ప్రభుత్వ బిసి బాలికల కళాశాల వసతి గహం-4 విద్యార్థినిలకు ఫ్యాన్లు అందజేశారు. ఈ సంద ర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లా డుతూ క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వలన ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పరీక్షలు పెద్ద సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఫ్యాన్లు, లైట్లు వితరణ చేసినందుకు వార్డెన్ లలిత, విద్యార్థినిలు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సిబి ఈవెంట్ వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో 17వ డివిజన్ పరిధిలో గల గాజులవీధి అంగన్వాడీ కేంద్రంలో సిబి ఈవెంట్ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు బస్వా రాజేష్ రెడ్డి పాల్గొని గర్భిణులను, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అందజేసి మాట్లాడుతూ 3, 4.నెలల గర్భిణులకు పౌష్టిక ఆహారంతో పాటు ఎంసిపి కార్డును కూడా అందిస్తామన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపుతానన్నారు. 3, 4 నెలలు నిండిన గర్భిణీలు ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం నుంచి అందే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమెన్ ప్రొటెక్షన్ అధికారి కె.ఎల్.రత్నకుమారి, ఎస్. నాగమణి, బి.సరస్వతి, సరిత, ఎ.ఉమాదేవి, ఎడబ్ల్యూహెచ్ జి.పద్మావతి, టి.హైమావతి, ఎస్.లక్ష్మీ, పాతిమా బేగం తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న ఈవెంట్ సంబరాలు